# నమస్తే తెలంగాణ

## ములుగు జయశంకర్ భూపాలపల్లి

5 | బుధవారం 17 జూలై 2024 | MULUGU JAYASHANKAR BHUPALPALLY




నీరు లేక వెలవెలబోతున్న హసన్‌పర్తి చెరువు

# నాడు మత్తళ్లు.. నేడు వెలవెల

### ఎండిపోయిన చెరువులు, కుంటలు

నర్సింహులపేట, జూలై 16 : వేసవి కాలం ముగిసి వానకాలం సగం దాటినా నేటి వరకు వర్షం కురవలేదు. కరువు ఛాయలు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. అడపాదడపా కురిసిన చిరుజల్లులకు పత్తి, మక్కజొన్న వంటి పంటలు వేసినా వరిసాగు మాత్రం ఎక్కడా ఇంకా ప్రారంభం కాలేదు. నర్సింహులపేట మండలంలోని 22 గ్రామాల్లో ఎక్కడ చూసినా చెరువులు, కుంటల్లో చుక్క నీరు లేని పరిస్థితి. గతేడాది జూలై నెలలో సమృద్ధిగా వర్షాలు కురిసి చెరువులు, కుంటలు మత్తడిపోయగా, ఈ ఏడాది ఇప్పటి వరకు భారీ వర్షం కురవలేదు. మండలంలో 8 చెరువులు, 38 కుంటల్లో చుక్కనీరు రాక రైతులు ఆందోళన చెందుతున్నారు. జూన్, జూలై నెలలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

**అడుగంటిన ఆకేరువాగు చెక్‌డ్యాం**

గతేడాది జూలైలో కురిసిన వర్షాలకు నర్సింహులపేట మండలం జయపురం వద్ద ఉన్న ఆకేరు వాగు చెక్ డ్యాం జోరుగా మత్తడి పోసింది. ప్రస్తుతం జూలై నెలలో చుక్క నీరులేక వెలవెలబోతున్నది. ఆకేరువాగును నమ్ముకొన్న రైతులు వరుణుడి కరుణ కోసం ఎదురు చూస్తున్నారు.



జనగామ రూరల్ : ప్రస్తుత వానకాలంలోనూ నీరు లేక ఎండిపోయిన ఎల్లం చెరువు

### ములుగులో నాలుగేళ్లలో మొదటిసారి ఇలా..

ములుగు జిల్లాలో గతంతో పోల్చితే సాగు పనులు వెనుకబడిపోయాయి. గత నాలుగేళ్లలో జూన్, జూలై మాసాల్లో వర్షాలు విస్తారంగా కురిసి చెరువులు మత్తడులు పడితే ఈ ఏడాది మాత్రం ఆశించిన వర్షాలు కురవక చెరువులు ఎండిపోయి కనిపిస్తున్నాయి. ములుగు జిల్లాలో అత్యధికంగా వరి సాగు చేస్తుంటారు. 90శాతం, చెరువులు, కుంటల కింద రైతన్నలు వ్యవసాయ పనులు చేసుకుంటుండగా 10శాతం రైతులు మాత్రం బోర్లు, ఇతర నీటి వనరుల ద్వారా వ్యవసాయ పనులు కొనసాగిస్తున్నారు. జిల్లాలో కాకతీయుల కాలం నాటి రామప్ప, లక్నవరంతో పాటు జిల్లా కేంద్రంలోని లోకం చెరువులోకి ఈ వానకాలంలో అనుకున్న మేర కొత్త నీరు రాలేదు. వర్షపాతం లేకపోవడంతో ఆయా చెరువుల్లో నీరు కనుచూపు మేర దూరంలో కనిపిస్తున్నాయి. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో అన్ని చెరువుల కంటే ముందుగా నిండుకునే లక్నవరం సరస్సు సైతం నేడు బోసిపోయి కనిపిస్తున్నది.

నేడు | నాడు



నర్సింహులపేట : ప్రస్తుతం నీరు లేక వెలవెల పోతున్న జయపురం ఆకేరు చెక్‌డ్యాం



నర్సింహులపేట : గతేడాది జూలైలో మత్తడి పడుతున్న జయపురం ఆకేరు చెక్‌డ్యాం (ఫైల్)

# వానల్లేక సాగుడెట్ల..?

- గతేడాది ఈ సమయానికి మత్తళ్లు
- నేడు ఎండిపోయిన చెరువులు
- ప్రాజెక్టుల్లో నీటిమట్టం నిల్
- ఒక్క శాతం కూడా పూర్తి కాని నాట్లు
- ఇలాగే అయితే ఈసారి వరికి ఉరే

**ఆశించిన వానల్లేక ఎవుసం ముందుకుసాగడం లేదు. అదును దాటుతున్నా వరుణుడు కరుణించక జల్లులకే పరిమితమైన మోస్తరు వర్షం అన్నదాతకు ఊరటనివ్వడం లేదు. గతేడాది ఇదే సమయానికి చెరువులు మత్తళ్లు దుంకి, ప్రాజెక్టులకు వరద చేరి రైతాంగం వర్షానందంతో వ్యవసాయ పనుల్లో నిమగ్నం కాగా ఈ ఏడాది మాత్రం అటు వాతావరణ శాఖ, రైతుల అంచనాలను తలకిందులు కావడంతో చాలాచోట్ల అడుగంటిన చెరువులు, పారకం లేని చెక్‌డ్యాములు బోసిపోయి దర్శనమిస్తున్నాయి. ఫలితంగా లక్షా 12వేల ఎకరాల్లో వరి సాగయ్యే ములుగు లాంటి జిల్లాలో సీజన్ మొదలై 45 రోజులైనా ఇప్పటివరకు కేవలం 1100 ఎకరాల్లో మాత్రమే వరి నాట్లు వేయడం వర్షపాతం లోటును తెలియజేస్తున్నది. అదును దాటుతుండడంతో వరి నార్లు నారుమడి దశలోనే ముదిరిపోతుండడంతో నాట్లేసేందుకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన కూలీలకు చేతినిండా పనిలేక నిరాశే మిగులుతోంది. ఒకవేళ ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే వరికి ఉరేనని రైతన్న దిగాలు చెందుతున్నాడు.**

- ములుగు, జూలై 16 (నమస్తే తెలంగాణ)/ హనుమకొండ సబర్బన్



ధర్మసాగర్ రిజర్వాయర్‌లోకి వస్తున్న దేవాదుల నీరు

### ధర్మసాగర్‌కు చేరిన దేవాదుల నీరు

జిల్లా దక్షిణ, ఎగువ భాగం వ్యవసాయరంగానికి ఇతోధికంగా సహాయం అందించే జే చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం నీరు కూడా ఈసారి ఆలస్యమే అయింది. మేడిగడ్డలో సాంకేతిక కారణాల వల్ల అందులో ఉన్న నీటిని దిగువకు వదిలారు. దీంతో తుపాకులగూడెం (సమ్మక్క) బరాజ్ నుంచి నీరు వృథాగా సముద్రం పాలైంది. దీంతో వేసవిలో చుక్క నీరు కూడా లేకుండా పోయింది. ఇప్పుడు కూడా గోదావరికి వరద మొదలై నెల కావస్తున్నా పంపింగ్ మాత్రం ఆలస్యంగా ప్రారంభించారు. మంగళవారం నాటికి రెండో దశ మోటార్ నుంచి ధర్మసాగర్ రిజర్వాయర్‌కు నీరు చేరింది. బుధవారం మరో పంపు కూడా పోస్తుందని అధికారులు చెబుతున్నారు. ఈ రెండు మోటర్లు నడిస్తే ధర్మసాగర్ రిజర్వాయర్ నిండేందుకు 20 రోజులు పడుతుంది. అప్పటికీ అదును దాటిపోతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

### అన్నదాతను కరుణించని వరుణుడు | ముందుకుసాగని వ్యవసాయ పనులు

వరి పంటకు ప్రాణాధారమైన వరుణుడు ఈసారి ముఖం చాటేయడంతో పాటు ముందస్తు ప్రణాళికలు లేని పాలకుల పుణ్యమా అని పంట కాలువలు కూడా నిస్తేజంగా వెక్కిరిస్తున్నాయి. దీంతో వరి నార్లు నారుమడి దశలోనే ముదిరిపోయి అన్నదాతల వైపు బేలగా చూస్తూ దుఃఖిస్తున్నాయి. వానకాలం సగం పూర్తి కావస్తున్నా వర్షాలు మాత్రం అంతంత మాత్రంగానే కరుణించాయి. హనుమకొండ జిల్లాలో లక్షా 50వేల ఎకరాల్లో సాధారణ వరి సాగు ఉంటుందని వ్యవసాయ శాఖ అంచనాలు వేసింది. ఈ మేరకు అధికారులు ప్రభుత్వానికి నివేదికలు కూడా ఇచ్చారు. ఈసారి ముందస్తుగానే నైరుతి రుతుపవనాలు రాష్ట్రానికి వచ్చేస్తాయని వాతావరణ శాఖ సైతం అంచనా వేయడంతో రైతులు సంతోషించారు. వెనుకాముందు ఆలోచించకుండా ఉత్సాహంగా రోహిణి కార్తెలోనె వరి నార్లు పోసుకున్నారు. అయితే ప్రతి ఏడాది దీర్ఘకాలపు సన్నరకం పంటలే వేసే రైతులు మాత్రమే రోహిణి కార్తెలో నార్లు పోసుకునే వారు. అయితే ఇందుకు విరుద్ధంగా సన్నరకం వడ్లకు మాత్రమే సబ్సిడీ ఇస్తామని ప్రభుత్వం చెప్పడంతో మెజార్టీ రైతులు ఆశకు దీర్ఘకాలిక సన్నరకం వడ్లను పండించేందుకు సిద్ధమయ్యారు. జిల్లాలో 27 సెంటీమీటర్ల సాధారణ వర్షపాతం కాగా ఇప్పటివరకు 30 సెం.మీ వర్షపాతం నమోదైనప్పటికీ చెరువుల్లోకి చుక్క నీరు వచ్చింది లేదు. మొత్తం 740 చిన్న, పెద్ద చెరువులు ఉంటే అందులో 10 శాతం కూడా నీరు రాలేదు. దీంతో మే చివరి వారంలో నార్లు పోశారు. అయితే వర్షాలు మాత్రం వాతావరణ శాఖ అంచనాలను తలకిందులు చేస్తూ చిరు జల్లులకే పరిమితం అవుతున్నాయి. దీంతో నార్లు మడి దశలోనే ముదిరిపోతున్నాయి. ఇప్పుడున్న పరిస్థితుల్లో బావుల సౌకర్యం ఉన్న రైతులు తమకున్న పూర్తి విస్తీర్ణం కాకుండా నీళ్లు అందిన మేరకు ఎకర, అర ఎకర విస్తీర్ణంలో నాట్లు వేస్తున్నారు. నాట్లు ముమ్మరంగా ఉంటాయని అన్ని గ్రామాలకు ఏజెంట్ల ద్వారా వందలాది మంది వలస కూలీలు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి చేరారు. వారికి చేతి నిండా పనిలేకపోవడంతో నిరాశలో ఉన్నారు. స్థానిక మహిళా కూలీలకు సైతం పనిలేకుండా పోయింది. పంట పొలాల్లో బలం కోసం విరివిగా వేసుకున్న పచ్చిరొట్ట ఎరువులను సైతం దున్నే సమయం మించిపోవడంతో ముదిరి చెట్లను తలపిస్తున్నాయి.



నర్సింహులపేట : సాగు లేక బీడుగా ఉన్న వరి పొలాలు



**ప్రాజెక్టుల్లో కానరాని జలాలు**

హనుమకొండ జిల్లా వ్యవసాయరంగానికి శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు అనుబంధంగా ఉండే కాకతీయ కాలువ ఆయువుపట్టుగా నిలుస్తుంది. దీనికి కరీంనగర్‌లోని లోయర్ మానేరు డ్యాం(ఎల్ఎండీ) నుంచి నీళ్లు విడుదల చేస్తారు. 24 టీఎంసీల సామర్థ్యం గల రిజర్వాయర్‌లో ప్రస్తుతం 6 టీఎంసీల నీరే నిల్వ ఉంది. ఇవి కరీంనగర్ నగర ప్రజలకు తాగు నీటికి కూడా సరిపోవని తెలుస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టులోని కొన్ని పంపులను నడిపి నీటిని పంపింగ్ చేసే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం ఆచరణలో పెట్టలేదనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఇప్పటికైనా వర్షాలు పడని పక్షంలో ఎన్నడూ లేని స్థాయిలో కాకతీయ ఆయకట్టు ఎడారిని తలపించే ప్రమాదముందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

### ఒక్క శాతం కూడా పూర్తి కాని వరి నాట్లు

ములుగు జిల్లాలో వానకాలం సీజన్‌లో 1,12,189 ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అంచనా. అయితే ఇప్పటివరకు కేవలం వెయ్యి నుంచి 1100 ఎకరాల్లో మాత్రమే నాట్లు వేశారని అధికారులు చెబుతున్నారు. దీంతో జిల్లాలో ఒక్క శాతం కూడా వరి నాట్లు పూర్తి కాలేదని చెప్పవచ్చు. జిల్లాలో 320 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం ఉండగా ఇప్పటివరకు 366.2 మి.మీ వర్షపాతం నమోదైంది. వెంకటాపూర్, ములుగు, వాజేడు మండలాల్లో స్వల్ప వర్షపాతం నమోదు కాగా గోవిందరావుపేట, తాడ్వాయి, ఏటూరునాగారం, కన్నాయిగూడెం, వెంకటాపురం(నూగూరు), మంగపేట మండలాల్లో అధిక వర్షపాతం నమోదైంది. అప్పుడప్పుడు కురుస్తున్న వర్షాలను చూసి కొన్ని ప్రాంతాల్లో రైతులు ఇప్పటివరకు నార్లు కూడా పోయలేదు. వానలు కురుస్తాయని ఆశించి వరి నార్లు పోసిన వారు నాటు వేసేందుకు పొలాల్లో సమృద్ధిగా నీరు లేని కారణంగా నాట్లు వేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో కొన్ని గ్రామాల్లో అక్కడక్కడా నార్లు ముదిరిపోయి కనిపిస్తున్నాయి. మరో 15 రోజుల్లో విస్తారంగా వర్షాలు కురిసి చెరువులు, కుంటల్లో నీరు చేరితేనే వ్యవసాయ పనులు ముమ్మరంగా కొనసాగే అవకాశాలు ఉన్నాయి.



ముదిరి పోయిన వరి నారు

నేడు | నాడు



ములుగు : ప్రస్తుతం వర్షాలు లేక బోసిగా కనిపిస్తున్న ములుగు జిల్లా కేంద్రంలోని కాకతీయుల కాలం నాటి లోకం చెరువు



గత ఏడాది జూలైలో మత్తడి దుంకుతున్న లోకం చెరువు (ఫైల్)

# మక్కలకు రికార్డు ధర

### ఎనుమాముల మార్కెట్‌లో రూ. 2,775

కాశీబుగ్గ, జూలై 16: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం మక్కలకు రికార్డు స్థాయిలో ధర పలికింది. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2,090 ఉండగా, బీఎల్‌టీ రకం (డైరెక్ట్) మక్కలు క్వింటాల్‌కు రూ.2,775 పలికాయి. ఇది ఈ సీజన్‌లోనే అత్యధిక ధర అని మార్కెట్ వర్గాలు తెలిపాయి. సీజన్ ప్రారంభమైన అక్టోబర్ నుంచి ఇప్పటివరకు 87,416 క్వింటాళ్ల మక్కలు మార్కెట్‌కు వచ్చాయి. మంగళవారం గరిష్ఠంగా రూ.2,775, కనిష్ఠంగా రూ.2,550 ధర పలికింది.






# 22న దాశరథి శతజయంతి వేడుకలు

- పార్టీలకతీతంగా విజయవంతం చేయాలి
- హాజరుకానున్న నందిని సిధారెడ్డి, దేశపతి శ్రీనివాస్
- ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు
- ఏకగ్రీవంగా ఉత్సవాల కమిటీ ఎన్నిక



దాశరథి శతజయంతి ఉత్సవాల సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు

చిన్నగూడూరు, జులై 16 : ఈ నెల 22న చిన్నగూడూరులో నిర్వహించనున్న దాశరథి కృష్ణమాచార్యుల శతజయంతి వేడుకలకు పార్టీలకతీతంగా హాజరై విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు కోరారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని దాశరథి సోదరుల విగ్రహాలను పరిశీలించారు. అనంతరం కృష్ణమాచార్యుల శతజయంతి వేడుకల సన్నాహక సమావేశంలో మాట్లాడారు. నిజాం పాలనలో తెలంగాణ ప్రజల దుస్థితిని చూసి చలించిపోయిన కృష్ణమాచార్యులు తన కలంతో జాగృతం చేశాడన్నారు. శతజయంతి ప్రారంభ కార్యక్రమానికి కవులు, గాయకులు నందిని సిధారెడ్డి, దేశపతి శ్రీనివాస్ (ఎమ్మెల్సీ), డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రూనాయక్, మహబూబాబాద్ ఎమ్మెల్యే, ఎంపీలు మురళీనాయక్, బలరామ్ నాయక్, ఎమ్మెల్సీ సత్యావతిరాథోడ్, టీఎన్‌జీవో పూర్వ అధ్యక్షుడు దేవీప్రసాద్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ అధ్యక్షుడు విరాహత్ అలీ హాజరవుతారని తెలిపారు. వేడుకల అనంతరం మండల కేంద్రం నుంచి మహబూబాబాద్‌కు భారీ బైక్ ర్యాలీ ఉంటుందన్నారు. ఎస్వీ ఫంక్షన్ హాలులో కవులు, గాయకులు, దాశరథి అభిమానులు, ప్రజా ప్రతినిధులతో వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జయంతి ఉత్సవాల కమిటీని గ్రామస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గునిగంటి కమలాకర్, సభ్యులుగా సత్యనారాయణ, బ్రహ్మం, లక్ష్మణ్, మోహన్, శంకరయ్య, నర్సయ్య, అనిల్, సురేశ్, సోమన్న తదితరులు ఎన్నికయ్యారు. సమావేశంలో మహబూబాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, కౌన్సిలర్ వేణు, వైస్ ఎంపీపీ వీరన్న, నాయకులు ప్రమోద్‌రెడ్డి, కన్నా, మడత వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# అడుగు తడబడితే అంతే..



టేకుమట్ల, జూలై 16 : టేకుమట్ల-రాఘవరెడ్డిపేట మధ్య చలివాగు వంతెన గత జూలైలో వరదకు కూలిపోయింది. దీంతో తాత్కాలిక మట్టి రోడ్డు వేయగా సోమవారం కురిసిన వర్షానికి కొట్టుకుపోయింది. దీంతో వాగు అవతలి గ్రామాల ప్రజలు ప్రమాదమని తెలిసినా వంతెన గడ్డర్లపై అడుగులో అడుగు వేస్తూ వాగు దాటుతున్నారు. వెంటనే వంతెన నిర్మాణం పూర్తి చేసి రవాణా సౌకర్యం కల్పించాలని వారు కోరుతున్నారు.




















